# రబీ సాగుకు రైతాంగం సన్నద్ధం

- ఆరుతడి పంటలపై రైతుల ఆసక్తి
- అప్పులు చేసి విత్తనాల కొనుగోలు
- కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలంటూ ఎదురుచూపులు


రబీ సాగుకు పొలం పనులు చేస్తున్న రైతు

సుండుపల్లె : ఇటీవల కురిసిన వర్షాలు ప్రభావంతో రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో ఇప్పటికే రైతులు వేరుశనగ పంటను సాగు చేసేందుకు దుక్కులు దున్ని, ఆధునిక యంత్ర పరికరాలతో భూమిలో విత్తనాలు వేస్తున్నారు. కొంత మంది రైతులు ఉలవ పంటను సాగు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ప్రారంభంలో పెట్టుబడి సహాయంగా రైతులకు ఇప్పటికే క్రమం తప్పకుండా రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక సహాయాన్ని అందజేసేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు రైతులకు ఆర్థిక సహాయం అందజేసే దిశగా అడుగులు వేయలేదన్న విమర్శలు రైతులలో అధికంగా వినిపిస్తున్నాయి. దీంతో అప్పులు చేసి పంటసాగు చేయాల్సిన స్థితిలో రైతులు అడుగులు వేస్తున్నారు.

**వర్షాలు కురుస్తున్నా..**

అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులు పంటను సాగుచేసేందుకు ఎరువులకు, విత్తనాలకు, పురుగు మందులకు, దుక్కి దున్నడానికి పెట్టుబడికి చేతిలో సొమ్ములేక అప్పుచేసి సాగుకు సమాయత్తం అయ్యారు. మండలంలో వర్షాలు పెద్దగా కురవక పోవడంతో భూగర్భ జలాలు కూడా పెరగని పరిస్థితి మండలంలో ఉంది. ఖరీఫ్‌కి దూరంగా వారు సైతం రబీకి సిద్ధం సిద్ధమవుతున్నారు. వర్షాధార పంటల కాకుండా తక్కువ నీటితో పంటలు చేతికందే వాటిని సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు**

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సహాయం ద్వారా రూ. 13,500లు అందజేసేది. ఇప్పుడు సీఎం కిసాన్ ద్వారా వచ్చే రూ. 2 వేలు చాలదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రతి ఏటా అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రచురించి ఇప్పటి వరకు రైతుల పెట్టుబడి సహాయంపై ఎటువంటి ప్రకటన చేయలేదు. దీంతో రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా మండలంలో రైతులు 7482 మంది ఉండగా, గత ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా మండలంలోని రైతులకు ఒక్కో సంవత్సరానికి రూ. 5,61,15,000 చేకూరింది. అలాగే పీఎం కిసాన్ ద్వారా చేకూరిన లబ్ధి రూ. 4,48,92,000 ఒక్కో సంవత్సరానికి రైతులకు చూకూర్చిన లబ్ధి మొత్తం. 10,10,00,700లు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరు మాసాలు గడుస్తున్నా రైతుల సాగు కింద అందిస్తామన్న నగదును అందించి ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

**రెండెకరాలలో సాగు చేస్తున్నా**



ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు ఎకరాలు ఉలవలు, మరో రెండు ఎకరాలలో టమాటా పంటలను ఈ రబీ సీజన్లో సాగు చేస్తున్నాను. పీఎం కిసాన్ ద్వారా రెండవ విడత రూ.2 వేల నగదు అందింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కోరుకుంటున్నాను.

– పాలపల్లె వెంకటయ్య, రైతు, గుట్టకాడపల్లి

**పెట్టుబడి సాయం అందించాలి**



నేను ఈ రబీ సీజన్‌లో మూడు ఎకరాలు వేరుశనగ పంటను వేశాను. ఇప్పటివరకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, దుక్కి దున్నడం, విత్తనాలు వేసేందుకు రూ.40 వేలు ఖర్చు వచ్చింది. గత ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా పేరుతో రూ.13,500 ఇచ్చేది. ఎంతో కొంత వ్యవసాయానికి ఉపయోగపడేది. ఈ ప్రభుత్వం మాలాంటి రైతులకు పంటల పెట్టుబడికి ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకోవాలి.

– నంద్యాల నాగేశ్వరరావు, రైతు పెద్ద బలిజపల్లె

## క్లుప్తంగా

### అరటి రైతులను దగా చేస్తున్న దళారులు


ఎగుమతికి సిద్ధంగా ఉన్న అరటికాయలు

పుల్లంపేట : గత నాలుగు నెలలుగా అరటి ధరలు రైతులకు ఆశాజనకంగా ఉన్నాయి. కేజీ రూ. 15లు నుంచి రూ. 20లు వరకు ధరలు ఉన్నాయి. గత రెండు రోజుల నుంచి దళారులు రూ. 6 లు, రూ. 8లు మాత్రమే ఉన్నాయంటూ రైతులను నట్టేట ముంచుతున్నారు. ఆరుగాలం కష్టించి పంట చేతికందే సమయానికి ప్రతి ఏడాది రైతు దళారుల చేతుల్లో మోసపోవాల్సి వస్తోంది. పుల్లంపేట మండల వ్యాప్తంగా 3 వేల హెక్టార్లలో అరటి పంటను సాగు చేశారు. తక్కువ ధరకు అరటి పలకడంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దళారాలుపై ఉక్కుపాదం మోపి అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మల్లికార్జున

రాజంపేట : కడప – రేణిగుంట జాతీయ రహదారిలో ఎస్.ఎర్రబల్లి వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని నెల్లూరు జిల్లా, ఉప్పరపల్లికి చెందిన మల్లికార్జున గాయపడ్డాడు. నందలూరు నుంచి రాజంపేటకు బైక్‌లో వస్తుండగా వాహనం ఢీ కొంది. స్థానికుల సమాచారంతో గాయపడిన వ్యక్తిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించారు.

### ధర్మ రక్షణే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం


కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు

ఒంటిమిట్ట : ధర్మ రక్షణే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ధ్యేయమని అనంతపురం విభాగ్ కార్యావాహక్ జగదీష్ ప్రసాద్ అన్నారు. శత వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట గ్రామ పురవీధుల్లో బాకీ కవాత్ నిర్వహించారు. ఈ కవాతు మహిళల పూల వర్షాలతో ఘనంగా మొదలైంది. వందే మాతరం, భారత్ మాతాకీ జై అనే నినాదాలతో స్వయం సేవకుల కవాతు జరిగింది. అనంతరం ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం వెనుక వైపు ఉన్న ఖాళీ జాగాలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం విభాగ్ కార్యావాహక్ జగదీష్ మాట్లాడుతూ హిందువులందరూ ఏకమై దేశ ఔన్నత్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రాజు, మురళీ రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, గంగిరెడ్డి, బాలరాజు శివరాజు, యానాదయ్య, మండల ప్రజలు పాల్గొన్నారు.

### 30న మానవత సభ్యత్వ నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

లక్కిరెడ్డిపల్లి : మానవత మంచి విలువలతో కూడిన స్వచ్ఛంద సేవాసంస్థ అని చైర్మన్ బాల సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నలందా పాఠశాలలో మానవత నెలవారీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానవత చైర్మన్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మానవత మంచి విలువలతో కూడిన స్వచ్ఛంద సేవాసంస్థ అని, సంస్థకు మానవతా సభ్యత్వం విరివిగా చేసి సంస్థకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలన్నారు. ఈనెల 30న సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్నట్టు తెలిపారు. నవంబర్ 10వ తేదీ లోపల మండలంలోని అన్ని స్కూళ్లలో నైతిక విలువలపై అవగాహన జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ బాల సుబ్రమణ్యం, కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా సభ్యులు ఆరె శివయ్య, మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీ నాయక్, కోశాధికారి పి.రవిశంకర్, మానవత సభ్యులు విశ్వనాథ్, సాయి చరణ్, పి.వేణు, రెడ్డయ్య, జయన్న తదితరులు పాల్గొన్నారు.

### మల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసియున్న శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. బంధు మిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఇసుక పాలసీని ప్రభుత్వం పర్యవేక్షించాలి


భవన నిర్మాణ సంఘం సభ్యులతో కలసి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు చంద్ర

రాజంపేట రూరల్ : ఉచిత ఇసుక విధానం మాఫియా బారినపడి రాష్ట్రం నుంచి తరలిపోకుండా నిరంతరం ప్రభుత్వ అధికారులతో పర్యవేక్షించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం తాపీ మేస్త్రీలు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టంను అమలు చేస్తే కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చట్టంను త్వరగా అమలు చేయాలని కోరారు. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో కార్మికులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ సెక్రటరీ ఈ.సికిందర్, నాయకులు నరసింహా, పి.సుబ్రమణ్యం, నన్నేసాబ్, జయరాం, నాగభూషణం, గీవింద్, ఎం.గంగన్న, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై అభిరుచిని పెంపొందించుకోవాలి


విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డైట్ ప్రిన్సిపల్, నిర్వాహకులు

రాయచోటి అర్బన్ : ప్రతి విద్యార్థి సైన్స్‌పై అభిరుచిని పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపల్ జ్యోతిర్మయి అన్నారు. ఆదివారం స్థానిక డైట్ సభా భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహింపబడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.ఓబులరెడ్డి మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీలు నేటి ప్రపంచాన్ని శాసిస్తున్నాయన్నారు. విద్యార్థులు వాటిలో నైపుణ్యం సాధించాలంటూ కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, కంటివైద్యుడు రెడ్డెన్నలు మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థి దశలో బాగా కష్టపడినవారు జీవితంలో బాగా స్థిరపడ్డారన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ నవంబరు 9,10 తేదీలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రెండుజట్లను ఎంపిక చేశామన్నారు. కాగా ఈ పరీక్షలో 30 మండలాల నుంచి 42 టీంలు, 126 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి ధీరజ్, కార్తీక్, లహరిలు, ప్రైవేటు స్కూల్ విభాగం నుంచి చందు, మనస్విని, సాయి సంతోష్‌లు ఎంపికైనట్లు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శివయ్య, రామక్రిష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రామయ్య, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, గౌస్‌బాషా, నాగేశ్వరరావు, అరవింద్‌రెడ్డి, జయచంద్ర, శాస్త్రీ, సుభాషిణి పాల్గొన్నారు.

## చలో విశాఖపట్నంను జయప్రదం చేయండి


పోస్టర్ విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : నవంబరు 1న నిర్వహింప తలపెట్టిన చలో విశాఖపట్నం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నేతలు ప్రశాంత్,రమణ, అశోక్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం కూరగాయల గఫూర్ సాహెబ్ ఫంక్షన్ హాల్లో వారు చలో విశాఖపట్నం పోస్టర్‌లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను పరిరక్షణతోపాటు కడపజిల్లాలో ఉక్కుపరిశ్రమను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేడంతోపాటు ప్లాంటు నిర్వహణకు అవసరమైన స్వంత ఇనుము గనులను ప్రభుత్వం వెంటనే కేటాయించాలంటూ కోరారు. కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నేతలు గురునాథ్, సతీష్, సన్నీ, పీడీఎస్‌యూ మోహన్, ఏఐఎస్ఎఫ్ నేత కార్తీక్ పాల్గొన్నారు.

## సాల్ట్ పథకం ఒప్పందాన్ని రద్దుచేయాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

రాయచోటి అర్బన్ : ప్రపంచబ్యాంకుతో రాష్ట్రంలో అమలవుతున్న సాల్ట్ పథకం ఒప్పందాన్ని వెంటనే రద్దుచేయాలని, విద్యారంగంలో ప్రపంచబ్యాంకు విధానాలకు స్వస్తిపలకాలని యూటీఎఫ్ అన్నమయ్యజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని అలీ మాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ సాల్ట్ పథకంలో భాగంగా అమలవుతున్న విధానాల వలన ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతోందన్నారు. ప్రాథమిక పాఠశాలల విభజన, తరగతుల విలీనంతో తీవ్ర నష్టం జరుగుతోందంటూ తెలపారు. అంతేగాక ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌లు, అసంబద్ధ శిక్షణ కార్యక్రమాలు, అనవసర ఆన్‌లైన్ పనులు ఎక్కువై ఉపాధ్యాయులు బోధన నుండి దూరమవుతారన్నారు. పాఠశాలల మనుగడకు ప్రశ్నార్థకంగా ఉన్న జీఓ నం.117 ను వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. పాఠశాలల నిర్వహణకు పూర్తిస్థాయిలో గ్రాంట్లు మంజూరు చేయాలన్నారు. మన బడి – మన భవిష్యత్తు పథకం ద్వారా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలంటూ కోరారు.

## భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయాలు


సిద్దవటం: ఎల్లమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


లక్కిరెడ్డిపల్లి: దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మకు ఆదివారం వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న గంగమ్మ దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో వేచివున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారి చిన్నపాటి జాతరను తలపించింది. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

**ఎల్లమ్మకు భక్తుల ప్రత్యేక పూజలు**

సిద్దవటం : కడప – చెన్నై జాతీయ ప్రధాన రహదారిలో సిద్దవటం మండలం భాకరాపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ఎల్లమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గం బయనపల్లె గ్రామానికి చెందిన అమ్మవారి భక్తులు మద్దిలేటి మాట్లాడుతూ అమ్మవారికి మొక్కుబడి సందర్భంగా అభిషేకం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసినట్టు తెలియజేశారు.

## మనిషికి ఆరోగ్యమే నిజమైన సంపద


కంటి ఆపరేషన్ చేయించుకున్న వారి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న ఆకేపాటి


మృతుని బంధువుకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. మాజీ సమితి అధ్యక్షులు దివంగత పోలా వెంకటరెడ్డి శతజయంతిని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 150 మందికి పైగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆపరేషన్లు నిర్వహించిన వారికి ఆదివారం స్థానిక కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో శంకర్ నేత్రాలయ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలా వెంకటరెడ్డి శతజయంతిని పురస్కరించుకొని ఆయన కుమారులు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, పోలా వెంకటరమణారెడ్డి మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించి 150 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి వారికి చక్కటి కంటిచూపును అందించడం ఎంతైనా అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, ఆవుల చెంగల్‌రెడ్డి, కసిరెడ్డి రాజారెడ్డి, శిరీష్, సనిశెట్టి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

**మానవత్వం చాటిన ఆకేపాటి**

పట్టణంలోని ఆకేపాటి భవన్‌లో, మండలంలోని ఆకేపాడు ఎస్టేట్‌లో నిత్య అన్నదాన కార్యక్రమంతో పేద, మధ్య తరగతి ప్రజల ఆకలి తీర్చుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మరోమారు మానవత్వాన్ని చాటుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన రామ్‌సింగ్ అనే వ్యక్తి ఇటీవల రాజంపేటకు వచ్చి ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు మృతుని బంధువులు రాజంపేటకు చేరుకున్నారు. అయితే వారిచేతిలో డబ్బులు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆకేపాటి చలించి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతుల బంధువులను ఓదార్చి మృతదేహం మీ ప్రాంతానికి తీసుకెళ్లేందుకు ఉచితంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడమే కాక అంత్యక్రియల కోసం రూ.30 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, దాసరి పెంచలయ్య, జీవీ.సుబ్బరాజు, మలిశెట్టి శ్రీనివాసులు గౌడ్, అమర్, శేఖర్, పెంచల్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న విద్యార్థి నాయకుడు అంకన్న

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత విద్యకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలో పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు చదువులు కొనసాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రూ.3480 కోట్లు స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై 1, 3, 5 సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు చెల్లించాలని యూనివర్సిటీల నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇప్పటికే పలు ప్రైవేట్ కళాశాలలో యాజమాన్యాలు పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిళ్లు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## దేవుని యందు భయభక్తులు కలిగి జీవించాలి

నాచారం చర్చి ఫాస్టర్ ఎబినేజర్

కురబలకోట: దేవుని యందు భయ భక్తులు కలిగి జీవించాలని హైదరాబాద్ సీయోను ప్రార్థనామందిరం చర్చి పాస్టర్ ఎబినేజర్ అన్నారు. నియోజకవర్గంలోని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన ఆరాధన, బల్ల వర్తమానం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తి ఉంటే పాపాలు పోగొట్టుకుని రక్షణ పొందుతారని, భయం ఉంటే పాపం జోలికి వెళ్లరని అన్నారు. పరిశుద్ధత లేకుండా దేవునికి దగ్గరకాలేరన్నాది గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఫాస్టర్ విక్టర్ వేదనాయక్, సహ పాస్టర్లు శామ్యూల్, జయరాజ్‌రెడ్డి, భాస్కర్, మూలింటి నాతానురెడ్డి, నెహెమ్యా, తిమోతి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రచయిత రామచంద్రయ్య మృతి తీరనిలోటు

మదనపల్లె సిటీ: టెలికాం మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్, రచయిత రామ చంద్రయ్య మృతి తీరని లోటు అని ప్రముఖ రచయిత టీఎస్ఏ.క్రిష్ణమూర్తి అన్నారు. ప్రజా చైతన్య స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రశాంత్ నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం రామచంద్రయ్య సంస్మరణ సభ జరిగింది. క్రిష్ణమూర్తి మాట్లాడుతూ బహుభాషా ప్రవీణులు, రచయిత, గ్రంథకర్త, చిత్రకారులు, కళాకారులుగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు, కార్యదర్శి నాగభూషణరావు, రచయితలు కనక సభాపతి, మోహన్‌వల్లి, రెడ్డప్ప, వీఎం.నాగరాజ, వాసా క్రిష్ణమూర్తి, శ్రీధర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇరుగులమ్మకు పూజలు


పూజలందుకున్న ఇరుగులమ్మ

సిద్దవటం : మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెలసిన ఇరుగులమ్మకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, తదితర పూజలు చేశామన్నారు. కొందరు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

### రెడ్డెమ్మకొండ.. భక్తులతో కిటకిట

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మతల్లీ.. చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వేకువ జామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రదాయినిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. పరిసరాల్లోని దిగువ తొట్లివారి పల్లెలో అర్చకుల కుటుంబీకులు పంపిణీచేసే ఆకు పసరు తాగి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతో అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు బంగారు, వెండి, చీరె సారె సమర్పించి మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతోపాటు ముస్లింలు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

### అధ్యాపకులకు ఆన్‌లైన్ పరీక్ష


పరీక్షలకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

కురబలకోట: మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్‌డ్ లర్నింగ్ ఎన్‌పీటీఈఎల్) పేరిట మూడు రోజుల పాటు సర్టిఫికేషన్ కోర్సుకు ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షలకు వివిధ ప్రాంతాల నుంచి 3734 మంది అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపల్ యువరాజ్ మాట్లాడుతూ ఏడాదికి రెండు మార్లు ఈ పరీక్షలు నిర్వహిస్తారని, ఉత్తీర్ణులైన వారికి ఎన్‌పీటీఈఎల్ వారు సర్టిఫికెట్ అందిస్తారని తెలిపారు. అదే విధంగా మిట్స్ కళాశాల బీటెక్ విద్యార్థులు పి.ఇందు, జె.జయశ్రీ జేఎన్‌టీయూ కబడ్డీ టీమ్‌కు ఎంపికైనట్లు తెలిపారు.